# నెపోలియన్

## 1

పట్నంలో శివరావు ఇంటర్మీడియెట్ పరీక్షకి చదువు తున్నాడు. ఆ సాయంత్రం గ్రూప్‌పేపర్ వ్రాసిం తర్వాత గదిలో తనస్నేహితులతో పరీక్షవిషయాలను గురించి ముచ్చటిస్తున్నాడు. ఇతనికి చిన్నప్పటినుంచీ చరిత్ర అంటే చాలా యిష్టం. ఇంటర్మీడియట్‌లో కూడా చరిత్రే తన గ్రూప్‌గా తీసుకున్నాడు. యూరప్ దేశపు చారిత్రాత్మిక ఘట్టాలన్నిటిలోకి ఫ్రెంచివిప్లవము, దానికి సంబంధించిన నెపోలియన్ దుండగాలంటే మిక్కిలి యిష్టం. నెపోలియన్ జీవిత చరిత్ర చాలామార్లు చదివాడు. ముఖ్యంగా డబ్బంటే లెక్కలేకపోవడంలో, స్త్రీలతో-ముఖ్యంగా తక్కువ జాతి వాళ్ళతో-మాట్లాడడంలో నెపోలియన్ చూపే వుత్సాహం యితనికి చాలానచ్చాయి. అప్పుడప్పుడు యింట్లో తన భార్యదగ్గిర తను నెపోలియన్ అనుకుని స్వేచ్ఛతో కూడుకొన్న వుల్లాసంతో చేసే అల్లర్లలో-ఆలస్యమైనప్పుడు కాఫీకెటిల్‌ని తన్నడం-దీపావళి పండగరాత్రి మాస్కో దహనం అనిచెప్పి మతాబాతో భార్య గ్లాస్కోమల్లు చీరకొంగు కాల్చడం-భార్య కివ్వగా మిగిలిన పూలను దాసీదాని కివ్వడం-కొన్ని. అతని పడకగది లోనికి ప్రవేశించగానే మనకు మొదట కనుపించేది పెద్దదైన నెపోలియన్ పటమే, స్వవిషయాలమాట అట్లావుంచి పరీక్షలలో గూడా నెపోలియన్‌ను గూర్చి పేపర్లలో అడిగినా, అడగకపోయినా వ్రాసి వొచ్చేరకంలోకి దిగింది అతని వీరపూజ.

"ఆన్ని వ్రాశాను గాని నెపోలియన్ పుట్టిన తేదీ వెయ్యలేదురా, అవధానీ!" అన్నాడు శివరావ్.

"నీమొహంలా వుంది. పుట్టినరోజూ అవన్నీ యెందుకు? వాటర్లూ యుద్ధాన్నిగురించే ముచ్చటిస్తే చాలు." అన్నాడు అవధాని.

"దానికేం గాని అసలు నెపోలియన్ పుట్టింది రాత్రా, పగలా?" అని శివరావ్ తమాషాకి ప్రశ్నించాడు.

ఇంతలో పోస్టుబంట్రోతు టెలిగ్రామ్ అందచేస్తాడు. "ఉదయం ఆరుగంటలికి నీ భార్య సుఖప్రసవమైంది. మొగపిల్లాడు. తల్లీ, పిల్లాడు క్షేమం."

"సరే నెపోలియన్ ఉదయం ఆరుగంటలకి జన్మించాడోయ్-పద, టీపార్టీ చెయ్యి" అన్నాడు వేళాకోళంగా అవధాని.

అప్పటినుంచి శివరావ్ పిల్లాడికి "నెపోలియన్" అన్నది సార్థక నామమైంది.

## 2

ఈకధకి పూర్వగాధ పైది. ఇప్పుడు శివరావ్ రెండుమూడుసార్లు బి. ఏ ఫేలయి ఆఖరి కెల్లాగో ప్యాసయి నిరుద్యోగసమస్యని యెల్లా బ్రద్దలు కొడదామా అని ఆలోచిస్తూ యింట్లో కూర్చున్నాడు. తగినంత ఆస్తి వుండడంవల్ల అతనికి చిల్లరి వుద్యోగాలు చెయ్యడం కూడా యిష్టం లేదు ఓమేడాది ఐ. సి. యస్ సెలక్షన్ పరీక్షకి కూడా కట్టి చూశాడు. నాలుగుమార్కులు తక్కువ రావడంబట్టి కాని, లేకపోతే యీపాటి కప్పుడే ఇంగ్లండులో వుండి నెపోలియన్ చరిత్ర పరిశోధిస్తూ వుండేవాడు. ఇంతలో పోస్టుజవా నిచ్చినవుత్తరం తీసి చదివాడు.

"నేనూ, నెపోలియనూ రేపు ఉదయం బండిలో వస్తున్నాం స్టేష న్కు రావలసింది మీకు తీరుబడి అవుతుందని తోచదు. కారణం నాకు తెలుసునులెండి. అమ్మ మీరా!సులోచనముక్క కావాలామీకు? మీరు రోజూ సాయంత్రం యెక్కడి కెడుతోన్నది, రాత్రి యెందుకు ఆలశ్యంగా వొస్తో న్నది....యెందుకు అవన్నీ ఉత్తరంలో వ్రాయడం?

ఓవేళ, రేపు నేను రాకపోవచ్చు, ముట్టునెల....ఐనా సరే వొస్తా నేమోకూడా చెప్పలేను....

ఎందు కొచ్చిన మీ

కమల."

ఉన్నరహస్య మేమిటంటే శివరావుకి ఆడవాళ్ళు ముట్టు మూడు రోజులూ బైట కూర్చోడం-యింట్లో వంట కిబ్బంది కలిగించి ప్రక్కింటి వాళ్ళనో, హోటలయ్యర్నో బాధి చడం నచ్చలేదు. ఏదేశంలోను, ఏయి తరగులాలలోనుశేవి యీఆచారాన్ని నిర్మూలనం చెయ్యడానికి తను, భార్య నమకట్టారు. దీనికాటక● యేం లేదుకాని, యెప్పుడైనా ముసలమ్మలొస్తే మాత్రం చివాట్లు తగులుతాయి. అతను చేయదలచుకున్న సంస్కారాలలో "ముట్టు మూడురోజులు బైటకూర్చోడం తగదు" అన్నది మొదటిది. చదువుకున్న స్త్రీలు యీఆచారాన్ని పాటిస్తున్నారా? పుస్తకాలలో కథలలో మచ్చుకి వొక్క ఆడదైనా యెప్పుడైనా ముట్టయిందా?

మర్నాడు, ఆమర్నాడు, అంతకి పై మర్నాడూ కూడా స్టేషన్కి వెళ్ళాడు కాని రాలేదు, అతనిభార్య. ఇహవెళ్ళ దలుచుకోలేదు. తన ఆగ్రహాన్ని ఉత్తర పూర్వకంగా వెలిబుచ్చుకుని పోస్టులో వేద్దామని బైలు దేరి తలుపు తియ్యగానే సిద్ధమైంది భార్య నెపోలియన్తో.

"ఏం అప్పుడే వొచ్చావ్ పాపం యింకా వారంరోజు లుండలేక పోయ్యావా?" అని భుజంమీద చరవడానికి చెయ్యెత్తుతాడు.

"ముట్టుకోకండి, ముట్టుకోకండి.... వాణ్నికూడా....అరే ముట్ట కున్నారూ, పదండి, స్నానం చెయ్యండి."

దొడ్లో కెళ్ళి సాన్నం చేసింతర్వాత కొంచెం చల్లారింది అతని కోపం.

మధ్యాహ్నం గదిలో మంచంమీద పడుకున్నాడు, పత్రిక చదువు కుంటూ. గదిగుమ్మంలో నుంచుంది కమల, నెపోలియన్కూడా అతని దగ్గరగా వెళ్ళాడు.

"నాన్నోయ్, అమ్మ నన్ను ముట్టుగుంది, నిన్ను కూడా ముట్టుకో మంది....దోబూచీ...." అని ముట్టుకుంటాడు.

"ఈవెధవని అవతలికి తీసుకుపో, మళ్ళా స్నానం చెయ్యాలి...."

"పోనిద్దురు వొక్క మొలతాడేగా వుంది ...ఇదివరకు ముట్టుకున్న పరవాలేదన్నారుగా....?"

కోపంతో శివరావ్ "ఏవెధవ అన్నదీ?"

"అంత మాటవద్దు. మీరే...."

"ఊరికే అన్నాను. యెవళ్ళైనా వొస్తే మనింటికి-దగ్గిఱగా వొస్తున్నావే....వెళ్ళు దూరంగా వెళ్ళు...."

"అబ్బే వొట్టిదండి....తమాషా కన్నాను....నేను బాగానే వున్నాను ఏమీ అవందే...."

"ఏమీ అవకపోవడమేమిటి నీమొహం....అర్ముట్టేసుకున్నావు... స్నానం చెయ్యాల్సిందే....ఈవెధవనీ, సీతాఫలంకాయనీ అవతలికి తీసుకుపో."

"ఏమిటండీ అంతామీది మరీసోద్యం....ఓరే అబ్బాయి! మీనాన్న నోట్లోకూడా పెట్టరా, కొంచెం పండు...."

ఉన్న విషయం మేమిటంటే శివరావ్‌కు సీతాఫలం కాయంటే కిట్టను. అతనికళ్ళకి పండుకి గజ్జికురుపులేస్తే యెల్లా వుంటుందో అల్లా సీతాఫలంపండు. పైగా నెపోలియన్ ఆపండుని తను తింటూ కొంతపదార్థాన్ని ఛీమిడితో కూడా మిళాయించి అతని నోట్లో పెట్టబోతాడు.

"తియ్, యీవెధవని అవతలికి తియ్"

నెపోలియన్ నోట్లో పెట్టడానికి వీలుకాని సందర్భంలో మొహానికంత రాస్తాడు, ఆపదార్థాన్ని. ఆసందర్భంలోనే కమల మైలముద్దులూ...

3

ఇల్లాగే దినాలు నెపోలియన్ అల్లరితో గడిచిపోతున్నాయి. కొంచెం వంకరతిరిగిన పొడుగాటిముక్కు కాడలలాగు వేళ్ళాడే పాపిడితీయడానికి వీలచిక్కని జుట్టు, బైటికొచ్చిన కిందపెదవి యివన్నీ శివరావ్ పిల్లాడిని చూచినవారందఱికీ నిజంగా నెపోలియన్‌ని స్ఫురింప చేస్తాయి. నెపోలియనంటే శివరావుకు చాలా గారాబం కూడాను. అందుకనే వాణ్ణి బళ్ళోకికూడా పంపడంలేదు. మొదటి రోజున బళ్ళోకి వెళ్ళినప్పుడు మేష్టరు నీపేరేమిటని అడిగితే "నెపోలియన్" అని చెప్పాడు. ఆయనకి చాలా ఆగ్రహం వొచ్చి లెంపకాయ తగిలించాడు. నెపోలియన్ చేతిలో వున్న పలకని గిరవాటెట్టి పారిపోయొచ్చాడు.

కథా నిలయం
4541

ఒక రోజుని తండ్రి క్షురకర్మనిమిత్తం మొఖానికి సబ్బురాసుకుని కత్తి బల్లమీద పెట్టాడు ఒకచెంప చేసుకొన్న తరవాత నెపోలియన్ కత్తిని తీసుకుని వీధులోకి పారిపోయాడు. పక్కవాటాలో వున్న గురునాధంగారింట్లోకి వెళ్ళి అద్దంముందు కూర్చుని తనూక్షవరం చేసుకోవడం మొదలెట్టాడు. ఇంతలో గురునాధం వొచ్చి అదేం పనిరా అని కేక పెట్టాడు "ఇదా....మానాన్న పని, మీక్కూడా చేస్తా పట్టండి" అని మాట్లాడు తూనే క్షవరం చేసికోట మొదలెట్టాడు గురునాధం దగ్గఱ కొచ్చి బలవంతంగా కత్తిని లాక్కోవడంలో నెపోలియన్‌కి కుడిచెంపమీద గాటుపడింది రక్తం కారిపోతోంది

"ఏమయ్యోగుఱ్ఱంనాధం-చూసుకో మజా...నిన్ను కూడా కోస్తాలే... ఇయ్యి మానాన్న కత్తి నీకెందుకు....?"

మొహంమీద మచ్చ యేమిటని యెవరేనా అడిగినప్పుడల్లా నెపోలియన్ యుద్ధంలోతిన్నగాయం అంటూ వుంటాడు, శివరావ్.

ం ం ం

ఏమండి....పక్కింటి గురునాధం సూటు ధరిస్తాడేమిటి పిలకేసుకుని? టోపీయేనా పెట్టుకోడు. చాదస్తం మనిషిలా వున్నాడే అంది కమల భర్తతో.

అప్పుడయమే గురునాధంగారింట్లో పెద్దయుద్ధం జరిగింది గురునాధంకోసం పెట్టిన కాఫీ యెవరు తాగారో తెలియక అత్తగారు, గురునాధం భార్య నువ్వు తాగావంటే నువ్వు తాగావని మాట్లనుకుంటూ చాలా గొడవ చేసుకుంటున్నారు. నెపోలియన్ ప్రవేశం.

"ఏమండోయ్ గుఱ్ఱుగారు! మీ అమ్మ త్రాగుతోంటే నే చూశానండి మాగోడమీద నుంచి"

"ఏడిశావ్" అని లెంపకాయ వేసింది ఆవిడ. ఈ తగాదా చాలా దూరం వెళ్ళి వాళ్ళకి వీళ్ళకి మనస్పర్థలు కలిగి కొద్దికాలంలోనే శత్రుత్వం కూడా బయలుదేరింది.

అది వేసంగి. అంతా మంచా లేసుకుని ఆరుబైట పడుకునే రోజులు ఓనాడు నెపోలియన్ తెల్లారగట్టె లేచి కత్తెరతోగురునాధంగారి పిలకని కత్తి

రించాడు. మళ్ళా వుదయమే ఆరంభమయింది వాళ్ళింట్లో తగాదా. "ఇల్లా గయితే నే వుండనండి...." అంది గురునాధం భార్య "ఫరవాలేదు లెద్దు" అవి పిలక తడుముకున్నాడు. భార్య నవ్వుకుంది. ఇంతలో తల్లి లోపల్నించివొచ్చి

"అయ్యో, అయ్యో కొంప తవ్వేసింది రోయ్. నీపెండ్లాం నీపిలకని కత్తిరించింది రోయ్. దాని అందానికి నీపిలక తగదుట్రోయ్,' నెపోలియన్ ప్రవేశం.

"ఏమండోయ్ గుర్నాధంగారూ.... మీఅమ్మేనండి కత్తిరించమన్నది. చూడండి మీకత్తిరే యిది. నాకిచ్చింది."

మళ్ళా లెంపకాయ తగిల్చింది, ఆమె.

శివరావ్ భార్య ప్రోత్సాహించి తన పిలకని కత్తిరింపచేసింది అని గురునాధం అనుమానపడి కేసు కూడా పెట్టాడు. ఈకేసు పెట్టడానికి గురునాధంతల్లి భార్యల ప్రోత్సాహాలే కారణం, ఉత్తప్పుడు అత్తాకోడళ్ళు దెబ్బలాడుకుంటున్నా ప్రక్కింటివాళ్ళతో దెబ్బలాడడంలో యేకమవుతూ వుంటారు. చాలామంది స్త్రీలకు పొరుగిల్లే పరాయిలోకంలా కవిపిస్తుంది.

ఈ కేసుని రద్దుచేసేందుకు శివరావ్ చాలాశ్రమ పడ్డాడు. చాలాధనం ఖర్చుపెట్టాడు. నెపోలియన్ చెప్పిన సాక్ష్యంమీద ఈకేసులో శివరావ్ వోడిపోయి చాలా నిందకు లోనయ్యాడు. "గురునాధానికి పిల కేమిటనీ, చాదస్తం మనిషి అనీ" అన్ని తల్లివాక్కులు సందేహించ కుండా చెప్పేశాడు, సాక్ష్యం చెప్పడంలో.

## 4

ఆఊరు వొదిలిపెట్టి శివరావ్ బెజవాడలో కాపరం పెట్టాడు. గురునాధం పిలక విషయంలో నెపోలియన్‌వల్ల తను పడ్డ కష్టాలని స్మరించుకున్నప్పుడల్లా శివరావుకి పిల్లాడిమీద ఆగ్రహం రావడం కాకుండా వాడి కొంటెతనం, అల్లరిచేష్టలు తన భార్యవల్లనే సంపాయించాడని భావించి భార్యతోకూడా రోజూ యేదో వొంకవి యుద్ధం చేస్తూనేవున్నాడు.

"ఈ వెదవ ముఖం, గుణాలు, వెకిలినవ్వు, వొంకర ముక్కు-అన్నీ నీవే."

"నాదేం కాదు. వాడిది మీ మొహమే."

"నాది చస్తేకాదు వొంకరముక్కు బ్రేడ్‌మార్కు- నీదే."

"మీ తప్పడముక్కు కంపె తీసిపోయిం దేమిటి."

"నోర్ ముయ్."

"ఎవరి మొహమైతే యేం లేండి. మన మొహమే."

ఈ సంభాషణ విధాయికంగా రోజూ జరుగుతూనే వుంది.

o o o

ఒకరోజున శివరావ్ యింట్లో అద్దెకున్న శంకరం ఇంటిని బాగు చెయ్యవలసిన విషయం గురించి మాట్లాడే నిమిత్తం వచ్చాడు.

"శివరావ్‌గారు! దొడ్డి వైపు వసారా అంతా చిల్లులే.... వర్షమొస్తే మేం వంటింట్లోకి యీదుల్లాడుతూ పోవాలసిందే."

"సరే మొన్న కబురుచేశాను మేస్త్రీకి- మీరీయవలసిన...."

ఇంతలో నెపోలియన్ ప్రవేశం.

"నానోస్నేయ్, గమ్మత్.... చూడు." అని కుర్చీమీదికెక్కి మొగ్గేసి కుర్చీతోసహా కింద పడతాడు శంకరం, శివరావ్ నవ్వుతారు.

"మీ వా దేమిటండి?" మొన్న యెవరిదో పిలక కత్తిరించాడనీ.."

"నానోస్నేయ్ అమ్మే మరేమోనే...."

"చెప్పు.... చెప్పు అబ్బాయి!" అని శంకరం.

"నీ కెందుకయ్యా? నానోస్నేయ్, నువ్వు చెప్పుకో...."

"అబ్బ, అదేమటో చెప్పి యింట్లోకి పోరా...." అన్నాడు శివ రావ్.

"అబ్బే కాఫీకాస్తోంది...."

"నూటయాభై రూపాయలలోనూ, 15 మే..."

"నానోస్నేయ్, కాఫీ నీకియ్యాదుట...."

"అబ్బ, పోరా! వెధవా........ స్త్రీలకు పోతే మిగతాది...."

"స్త్రీల కేమిటండి?" అన్నాడు శంకరం.

"స్త్రీలకు కాదు మేస్త్రీలకు పోతే మిగతాది...."

"నాన్నోయ్ నాకు అణాకావాలి...." అవి బల్లని కదిపి సిరాబుడ్డిలో సిరా అంతా వొలకపోస్తాడు. శంకరానికి కోపం కూడా వొస్తుంది.

"దబ్బుని తేల్చండి.... వంటింటి వసారాలో మూడు...."

"నాన్నోయ్. అణా...."

"ఇస్తాను కాని, సునోసునో పాడు.... శంకరంగారు! మావాడు సునోసునో ఫస్టుగా పాడతాడండి...."

"సునోసునో నాకూ అణాయియ్యి. ఫనిహం అచ్చి తుమారీ కానీ."

"అల్లాకాదు సరిగా పాడితే ఇస్తాను అణా, లేకపోతే యివ్వను."

"సునో సునో నాకూ అణా...."

'సరేలే తరవాత పాడు."

"ఏమండోయ్ ఈ పాటలేనా? వ్యవహారం యేమన్నా వుందా....? నే చెప్పే దేమిటంటే...." అంటూ శంకరంగారు ఆవలించినప్పుడు ఆయననోట్లో సిరాబుడ్డిమూత దూదుస్తాడు నెపోలియన్. శివరావ్ వొక్క చెంపకాయి అంటిస్తాడు. ఏడుస్తూ నెపోలియన్

"తుమకుంచిపడీ అణా కానీ.... సునో...."

"దొడ్డిగోడ నాలుగుగజాలు పైకెత్తించి...."

"నాన్నా అణా, సునోసునో...." అవి గట్టిగా చెవులుగింగు రెత్తే టట్టు అరుస్తాడు.

"అసలు బాగానే పాడతాడండి వెధవ. ఇవాళంటే యేదో అల్లరి చేస్తున్నాడు కాని."

"దీనికేం లెండీ.... ఖర్చులు పోగా పాతికరూపా...."

"పైగా గొంతుకూడా పోయింది. రాత్రల్లా యేడిచి వెధవకి...."

విసుగెత్తి శంకరం గడియారంకేసి చూసుకుని మరోహప్పుడు మాట్లాడుకుందామని చెప్పి లేచి వెళ్ళాడు. తరువాత పదిరోజుల కీవుత్తరం వొచ్చింది.

"ఎప్పు డొచ్చినా మీరు మీ కుట్టాడి గొడవలోపడి అల్లరిచేయిస్తూ వ్యవహారం సాగనీయక పోవడంవల్ల, మీ యింటిని బాగుచేయించేదీ

లేంది తెలియపర్చకపోవడంవల్ల, యితరమైన చాలా కారణాలవల్ల మీ యిల్లు ఖాళీ చెయ్యడమైంది సదరు ఇంటి తాలూకు మీకు రావలసిన అద్దె 25 రూపాయిలు మనియార్డర్ ద్వారా యీ సంవత్సరం లోపుగా పంప గలను.

—శంకరం."

అని వుంది. శివరావ్ తన కోపాన్ని నెపోలియన్‌ని దెబ్బలు కొట్ట డంతో తీర్చుకున్నాడు నెపోలియన్‌కి నిత్యమూ దెబ్బలుతినడం కాఫీ త్రాగటం, నిద్రపోవడం లాగ అలవాటైపోయింది. ఆ అలవాట్లలాగే ఆతనికి దెబ్బలు తినకుండా వుండడం కూడా కష్టంగా వుంది.

## 5

ఆ మరుసటి సంవత్సరం శివరావ్ కుటుంబంలో కలహాలు మితి మీరాయి. వీటికి ఫలానా కారణం అని కూడా లేదు. భార్యని పుట్టింటికి పంపడంలో చూపే వుత్సాహం, రోజూ సాయంత్రంపూట యెక్కడికో చెప్పకుండా వెళ్ళి రాత్రి చాలా పొద్దుపోయే దాక రాకపోవడం భార్యకి యితని మీదుండే కోపానికి కారణాలు. అంతరంగికంగా విమర్శించుకుంటే అవి కోపకారణాలయినా తన ప్రవర్తనలో దోషంలేదని చూపేందుకు శివరావ్ దెబ్బలాడడమే ఆయుధంగా యెన్నుకున్నాడు. రాత్రిపూట పేకాట కెడుతున్నాననీ, పుట్టింటికి పంపితే ఆరోగ్యం బాగుంటుందనీ అతను చెప్పే సమాధానాలు.

"పోనీ నెపోలియన్‌నికూడా మీతో తీసుకెళ్ళరాదూ?"

"వాడు పేకాట చూస్తే అసలే పాడైపోతాడు. పైగా వాడల్లరితో మాకు యెట్లా సాగుతుంది?"

ఈ మాటలు విన్నాడు నెపోలియన్.

ఆ రోజు ఆదివారం. మధ్యాహ్నం రెండుగంటలకు బజారుకని చెప్పి శివరావ్ బైలుదేరాడు.

"నేనూ వొస్తాను నాన్నా." రావద్దని వొకచెంపకాయ తగిలించి వెళ్ళాడు. నెపోలియన్ వెంబడించాడు, తండ్రికి కనుపించకుండా. నాలుగు ఫర్లాంగులు నడచి సందులోకి మళ్ళి అక్కడ వొకగృహంలో ప్రవేశించ డం మళ్ళా పదినిముషాలలో బైటికొచ్చి సందు చివరికి నడిచిపోడం చూశాడు. తనూ ఆ సందులోకి మళ్ళి ఆ యింటి ముందుకెళ్ళి తలుపు తట్టాడు."

"ఎవరు నువ్వు?" లోపలినుంచి. తలుపు గుద్దుతాడు నెపోలియన్.

"మీరా, అప్పుడే వొచ్చారేం? ఇప్పుడేగా వెళ్ళింది.... కాళ్ళు కాలాయా యేం...." అని తలుపుతీసింది వొక స్త్రీ. కుఱ్ఱాడని చూసి ఆశ్చర్యపడింది. నెపోలియన్ లోపలికెళ్ళి మంచానికి నట్టనడుంగా కూర్చు న్నాడు.

"ఎవరబ్బాయవు నాయనా?"

"మీ రెవరు...."

ఎక్కిరిస్తూ 'మీరెవరు' అంది.

"బాగానే వున్నావులే కోతిలా, గుర్నాధం పెళ్ళాంలా," పోలికను బట్టి, "గురునాధం" అన్న పేరునుబట్టి అర్థం చేసుకుంది కనకం.

"మా నాన్నేడీ. రోజూ యిక్కడికేనా వొచ్చేది. ఏదీ పేకాట ఆడ డం లేదే" ఇంటిలోకి వెళ్ళి కనకం ఫలాలు, కాఫీ తెచ్చింది. ముద్దురావడం వల్ల నెపోలియన్‌ను యెత్తుకుని చక్కిలిగింత పెట్టుతూ అల్లరి చేస్తోంది కనకం. అరటిపండు కొన ముక్కులో దూర్చపోతాడు. ఇంతలో శివ రావ్ ప్రవేశిస్తాడు.

ఈ దృశ్యాన్ని చూసి స్తంభించిపోతాడు, శివరావ్ కనకం ఒకరి మొహాలొకళ్ళు చూసుకుంటారు.

"ఇంట్లో చెప్పడు కదా" అంది కనకం.

"చెప్పడులే....నేనంటే భయం వెధవకి....ఏరా చెప్పవుకదా ఇంట్లో....నీకు రూపాయిలు, కాఫీ....రేపు మోటారుకారు కూడా కొం టాను" అని లాలన చేస్తారు యిద్దరు.

"ఇంట్లో యేమని చెప్పొద్దు?"

"అదే మనం ఇక్కడికి కొచ్చామని.... అమ్మ అడిగితే పేకాట కెళ్ళామని చెప్పు."

"ఏదీ పేకాట?" లోపల్నించి పేక తెస్తుంది కనకం.

"అవుతే నాన్నా యీవిడెవరు. ఇల్లా తిప్పుకుంటుంది....?"— సమాధానం లేదు.

"చెప్పు నాన్నా! లేకపోతే అమ్మకి చెపుతా నంతే, నాన్న! ఒకావిడతో పేకాడడం లేదని."

"ఈవిడ మీ అమ్మకి...." తడుముకుంటాడు.

"సినిమాలో వేషం వేసేది, అనండి" అన్నది కనకం.

"అవుతే నాన్నా నీతోనేనే యింకెవరితోయైనా ఆడుతుందా?"

"ఆడకేం చాలామందితో ఆడుతుంది. డబ్బిస్తేసరి" అని కొంటెగా చూస్తూ అంటాడు.

"ఆ, ఆ, అల్లాంటిమాటలే వొద్దన్నాను" అని కనకం జడతో కొడుతుంది. నెపోలియన్ జెడపట్టుకులాగుతాడు.

## 6

అట్లాగే అప్పుడప్పుడు యిద్దరూ కలిసే విడివిడిగా తండ్రీకొడుకులు కనకం గృహానికి వెడుతూనే వున్నారు. తన రహస్యం నెపోలియన్ యెప్పుడు యింట్లో చెప్పేస్తాడోనన్న భయంతో శివరావ్ నెపోలియన్‌కి కావలసిందల్లా యిస్తూ చాలా ఆదరణతో చూస్తున్నాడు నెపోలియన్‌ని. అసలు తల్లితో వొంటరిగా వుండి మాట్లాడేందుకే అవకాశం యియ్యడం లేదు. కమలకి వీళ్ళింత అన్యోన్యంగా వుండడం ఆశ్చర్యం వేసింది. చాలా దినాలు గడిచిపోయాయి. ఆ రోజు సాయంకాలం బండిలో కమల పిల్లాడితో కూడా పుట్టింటి కెళ్ళింది. నెపోలియన్‌ని తనతో వుంచ

మని చాలా బ్రతిమలాడాడు. కాని లాభం లేకపోయింది పైగా అంత హటాత్తుగా తల్లిని ప్రయాణం కట్టించింది పిల్లాడే నన్న విషయం కూడా తెలియదు, శివరావ్‌కు. పీడ వొదిలిందనుకుని విశ్రాంతిగా ఆరాత్రి షోక్‌గా తయారయి కనకం యింటికి వెళ్ళి తలుపుతట్టాడు. దాసీది తలుపుతీసింది. కనకం ముఖానికి అడ్డంగా పెద్దగుడ్డ కట్టుకుని మూలుగుతూ పడుంది.

"ఏమొచ్చింది కనకం! జ్వరమా?"

"లేదు. కూర్చోండి. మీరు మళ్ళా యింటికి తొందరగా వెళ్ళాలా?"

"లేదు, లేదు. మావాళ్ళని వూరికి తోలేసాను. రాత్రంతా నాదు...."

"అవుతే మీ నెపోలియన్ కూడా వెళ్ళాడా!"

"ఆ వాడు వెళ్ళాడు. ఈవాళ వెళ్ళేలోపల నీకు చూపిద్దా మనుకున్నాను. ప్రొద్దున్నుంచీ కనపడే లేదు వెధవ. ఐతే కట్టు కట్టావేమిటి?"

"మీవాడు చేసిన పనే.. ప్రొద్దున్న యిక్కడికొచ్చాడు. మామూలుగానే చక్కలిగింతలు పెడుతూ పరాచకంగా అల్లరిచేశాను చేస్తూ పొరపాటున బుగ్గని కొరికాను. కొంచెం గట్టిగా కొరికానోయేమో నొప్పిచేసింది కాబోలు. నా ముక్కుని గట్టిగా చితికి ముక్కువూడేటట్లుగా పదినిమిషాలు యెంత గొలచేసినా వొదలందే కొరికేశాడు."

"అప్పుడు నే వొచ్చి విడిపించానండి పట్టు—అయ్యగారండీ" అంది దాసీపిల్ల. ఏదో సాధారణపుగాటు పడిందనుకున్నాడు శివరావ్.

"ఏదీ కట్టువిప్పు చూద్దాం." కట్టు విప్పింది. ముక్కు మొన నిజంగానే వూడిపోయి ఆ ప్రదేశమంతా యెర్రగా వాచి చితికిపోయిన టొమాటో పండు ఆకారం దాల్చింది.

ఆనాటినుండి కనకంతో సంపర్కం మానేశాడని చెప్పొచ్చు శివరావ్. కారణ మేమిటంటే శివరావ్ సౌందర్యపిపాస. అతని భావంలో కనకంలో చాలా అందమైనది ముక్కువొక్కటే. తనుకోరేది సులోచన ముక్కు. ఇప్పుడది కాస్తా నాశనమైంది. అందంలో యిదివరకున్న కళాను గుణ్యమైన ఔన్నత్యం చెడడం కాకుండా, వికృత రూపంకూడా దాల్చింది.

ఆ చితికిపోయిన భాగమంతా, పూడుకునేటప్పటికి రెండు నెలలు పట్టింది. ఈ రెండు నెలలూ దానింటికి వెళ్ళడానికి అతనిమనస్సు వొప్పింది కాదు. తను చేసే కృత్యం అసహజమైనదనీ, భార్యకి ద్రోహం చెయ్యడమనీ, పైగా ప్రేమ లేకపోవడం సరిగదా పదిమందితో పోయే వేశ్యతో పోవడం తనకు తానే కళంకం తెచ్చుకోవడమనీ శివరావుకు తెలుసు కాని సౌందర్యానుభవం సౌందర్యంకోసమేనని అతను నమ్మి కనకంతో స్నేహం సాగించాడు. ఇదివరకు కీట్సుకవి చెప్పిన "అందమైన వస్తువు సర్వకాలం ఆనందదాయకమైనదే" అన్న వాక్యం, అప్పుడప్పుడు తప్పు కావచ్చు నన్నవిషయం నెపోలియన్‌వల్ల నేర్చుకున్నాడు. కీట్సు "అందమైన" అని వ్రాసిన దానికర్థం "అందమైన స్త్రీలు అనే."

పైగా తను వెళ్ళడం మానేసిన రెండునెల్లలోన యితరులతో స్నేహం సాగించింది కనకం. అలోగా భార్యా, పిల్లలు రానే వొచ్చారు. నిరుద్యోగ సమస్య నెపోలియన్ వల్ల కొంత భాగం పరిష్కరింపబడింది శివరావ్‌కు. అతనికి వెంటనే ఉద్యోగం లభించింది. ప్రయత్నం చెయ్యడం దానికి తగినంత కృషి సల్పడమే దానికి కారణాలు. కనకంతో వున్న రోజులలో అతనికి తీరుబడి యేది? పిల్లలు-భగవంతుడు కళాదృష్టితో సృష్టించిన గొప్ప సంగతులని శివరావ్ నమ్మాడు.

పన్నెండు సంవత్సరాలు దాటిం తర్వాత నెపోలియన్‌కు పూర్వమున్న వుత్సాహమూ, అల్లరీ కూడా పోయాయి. అతని చిన్నప్పటిలాంటి చెంపకాయ, వెట్టి నవ్వు శివరావ్ మళ్ళా అనుభవించలేదు. తనకి మళ్ళా సారి కూతురు పుట్టినప్పుడు "జోన్ ఆఫ్ ఆర్క్" అని పేరుపెట్టాడు. కాని ఆ పిల్ల నెల రోజులకే కాలం చేసింది. ప్రతి వ్యక్తి జీవనంలోను ఆనందంతో కూడుకున్న సౌందర్యజ్యోతి వొక్కసారి మాత్రమే వెలుగుతుంది. ఆ వెలుగుని పెద్ద మంటగా చేద్దామని ప్రయత్నించి తలుపులను మూసినప్పుడు ఆరిపోతుంది.